క్లుప్తంగా

భవిత సెంటర్‌కు ప్రత్యేక పరికరాలు అందజేత



ఇబ్రహీంపట్నం: ఫెర్రీలోని భవిత స్పెషల్ నీడ్స్ సెంటర్‌కు రూ.1.5 లక్షల విలువైన సహాయ పరికరాలు, ఫర్నిచర్‌ను ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్, రూరల్ ఎడ్యుకేషన్‌)సంస్థ మంగళవారం అందజేసింది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సురక్షితమైన, సమగ్ర అభ్యాస వాతావరణం కల్పించడం లక్ష్యంగా వీల్‌చైర్లు, సెరిబ్రల్ పాల్సీ కుర్చీలు, కమోడ్ వీల్‌చైర్లు గదిలోని ఫర్నిచర్ అందించారు. ప్యూర్ సీఈఓ డాక్టర్ శైలా తాళ్లూరి మాట్లాడుతూ సంస్థ సేవలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సభ్యులు వనజ, ఎంఈఓ పుష్పలత, సీఆర్పీ డి.నాగేశ్వరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



తిరువూరు: మేరా యువ భారత్–మై భారత్ ఆధ్వర్యంలో తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పురుషుల విభాగంలో వాలీబాల్, షాట్‌పుట్, రన్నింగ్, బాలికల విభాగంలో కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు జరిగాయి. పోటీల విజేతలకు ఎస్ఐ సత్యనారాయణ, వాహినీ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు ప్రశంసాపత్రాలు, బహుమతి ప్రదానంచేశారు.

ప్రమాదకరంగా గుంత



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి నుంచి మైలవరం వెళ్లే ప్రధాన రహదారిపై యాదవుల బజార్ వద్ద గుంత ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రహదారిపై గుంత ఏర్పడిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



ఆగిరిపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని సురవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలను, ఇటీవల నూతనంగా పాఠశాలలో విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు చెబుతున్న పాఠ్యాంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వీధి వ్యాపారులకు లభించని తోడు

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- చిరు వ్యాపారులకు లభించని భరోసా
- పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ ఇబ్బందులు



ఆగిరిపల్లి రోడ్లపై పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు

ఆగిరిపల్లి: కుటుంబాన్ని పోషించుకునేందుకు అప్పులు తెచ్చి రోడ్డు పక్కన కొందరు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. అధిక వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న చిరు వ్యాపారులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'తోడు'గా నిలిచింది. వారి వ్యాపారానికి పెట్టుబడి కోసం రూ.10 వేల వరకూ వడ్డీ లేకుండా రుణం అందించి ఆర్థిక అభివృద్ధికి భరోసా కల్పించింది. దీంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చుకునే పరిస్థితి వారికి ఉండేది కాదు. రుణాలను సకాలంలో చెల్లించడంతో బ్యాంకులు సైతం ఇతర రుణాలు ఇవ్వడానికి ముందుకు వచ్చేవి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వీధి వ్యాపారస్తులకు భరోసా లేకుండా పోయింది.

పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు

చిరు వ్యాపారులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు డబ్బులు అప్పుగా తీసుకుంటున్నారు. వ్యాపారంలో వచ్చే లాభమంతా వడ్డీలు కట్టడానికి సరిపోతోందని వారు వాపోతున్నారు. రోజుకు రూ.500 సంపాదిస్తే దానిలో రూ.300 వడ్డీలకే సరిపోతోంది. దీంతో కుటుంబం గడవడమే కష్టంగా ఉందని ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

'జగనన్న తోడు పథకం' ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో 650 మంది చిరు వ్యాపారులకు నాలుగేళ్లలో రూ.2 కోట్ల పైన రుణాలను అందించారు. అంతేకాకుండా సకాలంలో రుణాలను చెల్లించిన వారికి అదనంగా ఏటా మరో వెయ్యి రూపాయల చొప్పున జోడిస్తూ వడ్డీ లేని రుణాలను అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ల సాయంతో రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చిరు వ్యాపారుల జీవన భృతి పట్టించుకోవడం మానేసింది. దీంతో వీరికి ప్రస్తుతం బ్యాంకులో కూడా ఎలాంటి రుణాలు మంజూరు చేయడం లేదు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలకు వడ్డీలు కూడా ఆయా బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లించేది. దీంతో బ్యాంకులు సైతం వ్యాపారస్తులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చేవి. కూటమి ప్రభుత్వం వీధి వ్యాపారస్తులకు రుణాలు ఇచ్చేందుకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వారికి వడ్డీ లేని రుణాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

పథకం కొనసాగించాలి

వడ్డీ లేని రుణంతో గత ప్రభుత్వం జగనన్న తోడు పథకంతో ఎంతో తోడుగా నిలిచింది. అటువంటి పథకం కొనసాగించాలని వీధి వ్యాపారస్తులు కోరుతున్నారు. ఈ పథకం చిరు వ్యాపారులకు ఎంతో అండగా నిలిచింది. అలాంటి పథకానికి నీలి నీడలు కమ్మడంతో వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ఈ పథకం ఈ ప్రభుత్వంలో కూడా కొనసాగాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

వ్యాపారానికి ఆర్థిక తోడు



గత ప్రభుత్వంలో జగనన్న తోడు పథకం ద్వారా రూ.10 వేల రుణం లభించింది. దీంతో పండ్లు కొనుగోలు చేసి ప్రతి రోజూ విక్రయించడంతో వచ్చిన డబ్బును ఇంటికి తీసుకు వెళ్లే వాళ్లం. ప్రస్తుతం ఇలాంటి పథకం లేదని అధికారులు చెబుతున్నారు. వ్యాపారం కోసం పెట్టుబడికి వడ్డీకి అప్పు తీసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం కూడా వడ్డీ లేని రుణాలు ఇస్తే బాగుంటుంది.

– కలగంటి అన్నామణి, చిరు వ్యాపారి, ఆగిరిపల్లి

ఆదుకునేవారు లేరు



గత ప్రభుత్వం తమకు అండగా నిలిచి వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో ఎంతో ఆసరాగా ఉండేది. ఇచ్చిన రుణంతో దుస్తులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. అంతేకాకుండా 'జగనన్న చేదోడు' పథకం ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందేది. ప్రస్తుతం బ్యాంకులో వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదు. దీంతో బయట అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సి వస్తుంది.

– షేక్ సర్దార్, టైలర్

300 మందికి వైద్య పరీక్షలు



విస్సన్నపేట: స్థానిక శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 300 మంది రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌కు చెందిన హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ కామినేని అచ్యుతబాబు, మహితా డెంటల్ స్పెషాలిటీ డెంటల్ అండ్ ఇంప్లాక్ట్ సెంటర్ డాక్టర్ నల్లూరి శ్రీధర్, మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ సెంటర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎండీ అహ్మద్‌పాషా వైద్య సేవలు అందించారు. శ్రీశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ బీవీ రాజేశ్వరరెడ్డి, ఎం పూర్ణచంద్రారెడ్డి, ఎస్. వెంకట్, ఆర్. రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందేలా బోధన

చాట్రాయి: విద్యార్థుల్లో మనవతా విలువలు పెంపొందించేలా బోధన ఉండాలని ఎంఈఓ–1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చనుబండ ఉషోదయ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు మాదక ద్రవ్యాల నిర్మూలన, నైతిక విలువలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ దబ్బిగొడ్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్సు తప్పనిసరి

తిరువూరు ఆర్డీఓ మాధురి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: దీపావళి పర్వదినం సందర్భంగా మందుగుండు సామగ్రి విక్రయించేందుకు తప్పనిసరిగా తాత్కాలిక లైసెన్సు పొందాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాణసంచా విక్రయ దుకాణాలు నిర్దిష్ట ప్రదేశంలో రక్షిత ఏర్పాట్లు చేసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, నీటి బకెట్లు, ఇసుక బకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. బాణసంచా దుకాణాల వద్ద పొగతాగడం నిషేధించాలని, అగ్నిమాపక వాహనం దుకాణ సముదాయం వద్ద సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపల్, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్యశాఖలు సమన్వయంతో బాణసంచా విక్రయ అనుమతులకు సిఫారసు చేయాలన్నారు. తిరువూరు డివిజన్‌లోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

ముసునూరు: బాణసంచా దుకాణాదారులు నిబంధనలు పాటించడంతోపాటు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ డి.ప్రశాంతి అధికారులకు సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని బాణసంచా దుకాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. దుకాణదారులు పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని చెప్పారు.

రహదారి సమస్య పరిష్కరించాలని బైఠాయింపు



రహదారి గుంత వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

విస్సన్నపేట: స్థానిక కొత్తపేట రహదారి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు డిమాండ్ చేశారు. కొత్తపేట రహదారిపై గుంతలలో నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ రోడ్లు గుంతలమయంగా ఉండటంతో పాటు డ్రెయినేజీ నీరు రహదారిపై ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి గుంతలమయంగా మారి మురుగునీరు రహదారిపైకి రావడంతో స్థానికులు రాకపోకలకు అసౌకర్యంగా ఉంటోందని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని, డ్రెయినేజీ సక్రమంగా పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, నాయకులు వి. రంగారాణి, శ్రీనివాసరావు, ధనలక్ష్మి, పి. ఏడుకొండలు, రాము, శ్రీను పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఆగిరిపల్లి: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం ఈనెల 18న ఆగిరిపల్లిలో నిర్వహిస్తామని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సుందరయ్య నిలయంలో మండల వ్యవసాయ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు వ్యవసాయ కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కృత్రిమ కాళ్లు, కాలిపర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: సుదీక్షన్ ఫౌండేషన్ విజయవాడ వారిచే ఉచిత కృత్రిమ కాళ్లు, కాలిపర్స్ అందజేస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ చిగురుపాటి విమల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గ ప్రజలు స్థానిక మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 96668 92583 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

కార్మికులకు అండగా సీఐటీయూ పోరాటాలు

ఇబ్రహీంపట్నం: అసంఘటిత రంగ కార్మికులకు అండగా సీఐటీయూ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, క్వారీ, క్రషర్‌లు, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, కార్మికుల వలసలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వైద్య సేవలు మెరుగుపర్చాలని సూచించారు. జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జి.కొండూరు: స్థానిక జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మను కలిసి విన్నవించారు. మహిళలు మాట్లాడుతూ కాలనీ చుట్టూ ఉన్న వరి పొలాల్లో నుంచి నీరు రోడ్లపైకి వచ్చి నడిచేందుకు కూడా వీలు పడడం లేదన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఇళ్ల మధ్యనే నిలవడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని ఎంపీపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ మాట్లాడుతూ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మైలవరం: 2025 మార్చి, ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో తాము బోధించిన సబ్జెక్టుల్లో 100 మార్కులు సాధింపజేసిన 15 మంది ఉపాధ్యాయులను, పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచిన ముగ్గురు ఉపాధ్యాయులను ప్రతిభా పురస్కార్ అవార్డుతో మంగళవారం సన్మానించారు. పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మైలవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవాబ్ జానీ, రాఘవరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్ మాట్లాడారు. ఎంఈఓలు బండి రాజు, ఎల్ బాలు, మైలవరం జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్. సతీష్, రాష్ట్ర కార్యదర్శి ఎ. పుల్లారెడ్డి, మైలవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ సతీష్‌కుమార్, ఎం. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

జి.కొండూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజయవాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లెల వసంతరావు హెచ్చరించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం విస్తృత తనిఖీలను నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖాధికారులు 40 బృందాలుగా ఏర్పడి జరిపిన ఈ తనిఖీలలో 3,146 గృహ సర్వీసులు, 142 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారని చెప్పారు. అదనపు లోడు అవసరమైన 196 సర్వీసులకు రూ.4.98 లక్షలను జరిమానాగా విధించామన్నారు. కార్యక్రమంలో మైలవరం సబ్ డివిజన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ. సుధాకర్, విజిలెన్స్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ రూరల్: పౌష్టికాహారం తీసుకోవటం వల్ల పరిపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ పెనరమల్లి రమాదేవి అన్నారు. నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మండల స్థాయిలో జాతీయ పోషకాహార మహోత్సవాలను సీడీపీఓ లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, తదితర అనారోగ్య సమస్యలను నివారించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ ఆహారంలో చిరు ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, సజ్జలు, రాగులు, కొర్రలు, పెసలు, శనగలు, పాలు, గుడ్లు, పండ్లు వంటి వాటిని క్రమం తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటల ప్రదర్శనను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ ప్రసాదరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు తారాభి, వెంకట్రావమ్మ, కరుణకుమారి, విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు చేసి జీఎస్టీని తగ్గించడం వల్ల ఇళ్లు నిర్మించాలనుకునే పేదలకు వరమని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం భవన నిర్మాణరంగ కార్మికులకు, కాంట్రాక్టర్లకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సిమెంట్, ఐరన్, బిల్డింగ్ మెటీరియల్‌పై జీఎస్టీ గతంలో కంటే తగ్గడం వల్ల వాటి ధర తగ్గిందన్నారు. దీని వల్ల గృహాలు నిర్మించుకోవాలనుకునే పేదలు, మధ్య తరగతి వారికి దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదా అవుతుందని చెప్పారు. జీఎస్టీ సవరణలో భాగంగా 350కి పైగా వస్తువుల ధరలు తగ్గాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, పలువురు కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఆలయాన్ని సందర్శించిన పీఠాధిపతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కర్ణాటక రాష్ట్రానికి చెందిన పాపాగ్ని మఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ మటముద్రం చంద్రశేఖర్ ఆచార్య స్వామి కొండపల్లిలోని విశ్వకర్మ ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు కత్తురోజు రామకృష్ణ, ఆలయ అర్చకులు ఆలూరి మల్లికార్జునశాస్త్రి పీఠాధిపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి బ్రహ్మశ్రీ మటముద్రం చంద్రశేఖర్ ఆచార్య స్వామిని శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు చిప్పాడ చందు, కర్రి పార్థసారథి, ఆచార్య చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

నూజివీడు: పట్టణ పరిధి గోడుగువారిగూడెంలోని శ్రీ నారాయణ స్కూల్‌లో చదువుకుంటున్న నాలుగో తరగతి విద్యార్థి స్కూల్ నుంచి బయటకు వెళ్లి స్కూల్ యాజమాన్యాన్ని, తల్లిదండ్రులను, పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. మండలంలోని కుక్కలతండాకు చెందిన బాలుడు (9) ప్రతి రోజూ మాదిరిగానే ఉదయం స్కూల్‌కి వెళ్లాడు. ఆ తరువాత టిఫిన్ తెచ్చుకుంటానని చెప్పి పాఠశాల నుంచి ఉదయం 8.22 గంటలకు బయటకు వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారమిచ్చింది. వారు హుటాహుటిన పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకగా మధ్యాహ్నం 12.30గంటల సమయంలో సుంకొల్లు వెళ్లే రోడ్డులో కనిపించాడు. వెంటనే బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ఆర్డీఓ బాలకృష్ణ

నందిగామ టౌన్: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆర్డీఓ బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లకు సంబంధించి డివిజన్‌లోని తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖాధికారులు, సొసైటీ సిబ్బంది, రైస్‌మిల్లర్లతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సాఫీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా తేమ శాతంపై రైతులకు అవగాహన కలిగించాలని చెప్పారు. అంతే కాకుండా కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనాన్ని జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ట్రక్ షీట్‌లను సక్రమంగా రూపొందించాలని చెప్పారు. రైతులకు అవసమైన సమాచారం, మార్గదర్శకాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద అందించాలని చెప్పారు. మిలర్లను సమన్వయం చేసుకుంటూ ధాన్యం దిగుమతిలో జాప్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతు ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని సూచించారు.